
సాక్షి ఒడిశా

శుక్రవారం । 19 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.80,172లు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆహార కేంద్రం పరిశీలన

రాష్ట్ర గృహ, నగర అభివృద్ధి శాఖ మంత్రి కృష్ణచంద్ర మహాపాత్రో స్థానిక క్యాపిటల్ ఆస్పత్రి ఆవరణలోని ఆహార కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు..

-8లో



'అనాథలకు రిజర్వేషన్లు కల్పించాలి'

అనాథ బాలబాలికలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని జెడ్పీ చైర్మన్ గవర తిరుపతిరావు అన్నారు.

-8లో

న్యూస్‌రీల్

అటవీ భూ పట్టాలు అందజేత



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న దృశ్యం

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలోని అడవుల్లో నివసిస్తూ అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న ప్రజలకు అటవీ భూమి పట్టాలు బుధవారం అందజేశారు. కొలార్ గ్రామ పంచాయతీలోని రాజీవ్ గాంధీ కేంద్ర ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బొయిపరిగుడ సమితి అధ్యక్షుడు ప్రశాంత కుమార్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టాలు ఇవ్వడంతో అటవీ ప్రాంతాల్లో సాగు చేసుకునేవారు ఇక నుంచి నిర్భయంగా ఉండవచ్చని పేర్కొన్నారు. సమితిలో ఇంకా మిగిలి ఉన్న భూమిలో నిరుపేదలకు త్వరలోనే పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 10 గ్రామ పంచాయతీ అడవుల్లో పంటలు పండించుకుంటున్న 10 కమ్యూనిటీ గ్రూపులకు పట్టాలు పంపిణీ చేశారు. అలాగే 55 మందికి వ్యక్తిగత అటవీ భూమి పట్టాలు అందజేశారు. కార్య క్రమంలో సమితి ఉపాధ్యక్షుడు పూర్ణిమ బారిక్, కొలార్ సర్పంచ్ జయంతి నాయిక్, స్ప్రెడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి బిదత్ మహంతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ సామంత పాల్గొన్నారు.

కమల పూజారికి మెరుగైన చికిత్స

- కటక్ ఆస్పత్రికి తరలింపు



కటక్ ఆస్పత్రిలో పద్మశ్రీ కమల పూజారి

జయపురం: అస్వస్థతతో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేరిన పద్మశ్రీ కమల పూజారిని మెరుగైన వైద్యం నిమిత్తం కటక్‌కు గురువారం తరలించారు. ఆమె కిడ్నీ, వృద్ధాప్య సంబంధింత వ్యాధులతో బాధపడుతున్నట్లు స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రి అధికారి డాక్టర్ రవీంద్రనాథ్ మిశ్ర తెలియజేశారు. ఆమె రాష్ట్రం గర్వించదగిన వ్యక్తి అన్నారు. ఆమెకు స్పెషలిస్టులైన డా.సునీల కుమార్ భొత్ర, డాక్టర్ భూపతి భూషణ జెన, డా.అభినాష్ బారిక్, ప్రసూతి స్త్రీ రోగ వైద్య నిపుణుడు డా.దిలీప్ కుమార్ బిశ్వాల్, డా.సుబ్రత కుమార్ కుహరో, డా.రతిక్ పాఢీ, డా.ఆద్యాశ జెన వంటి ఏడుగురు డాక్టర్ల బృందంతో వైద్యం అందించినట్లు వెల్లడించారు. పారామెడికల్ సిబ్బంది వివిధ పరీక్షలు జరిపారని రిపోర్టుల్లో క్రెయిటిన్, యూరియా ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా రక్తం తక్కువగా ఉందన్నారు. డాక్టర్ల రిపోర్టులు పరిశీలించిన అనంతరం జిల్లా వైద్యాధికారుల సూచన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం కటక్ తరలించినట్లు తెలిపారు.

3 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం



అరెస్టైన వ్యక్తులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు రాయఘడ పోలీసుస్టేషన్ పరిధి జిరంగో – కోయిపూర్ రోడ్డులో ఎక్సైజ్ అధికారులు గురువారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక పికప్ వ్యాన్‌లో బస్తాలు తరలిస్తుండడం గమనించి సోదాలు చేపట్టారు. వాటిలో 3 క్వింటాళ్ల గంజాయిగా ఉన్నట్లు నిర్ధారించి సీజ్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. మోహనా నుంచి కోయిపూర్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా గంజాయి రవాణా అవుతోందనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా ఇద్దరిని అరెస్టు చేసి, పర్లాకిమిడి కోర్టులో హాజరుపరిచారు.

నాగుపాము కలకలం



పడగవిప్పిన నాగుపాము

మల్కన్‌గిరి: స్థానిక కూముటిగూడ వీధిలో గురువారం ఉదయం నాగుపాము కలకలం సృష్టించింది. న్యాయవాది రామ్ ప్రసాద్ పట్నాయక్ ఇంట్లో పూలకుండీ వద్ద పడగవిప్పుతూ నాగుపాము కనిపించింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రాంతంలో ఇటువంటి పాము ఎప్పుడూ చూడలేదని స్థానికులు పేర్కొన్నారు. వెంటనే స్నేక్‌హెల్ప్ లైన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని పామును పట్టుకున్నారు. అనంతరం సమీప అడవిలో విడిచిపెట్టారు.

స్ట్రాంగ్ రూమ్‌కు.. ఆభరణాలు



వివరాలు వెల్లడిస్తున్న పూరీ గజపతి మహారాజు దివ్యసింగ్ దేవ్

- మరోసారి తెరిచిన రత్న భాండాగారం
- ఆభరణాలను తరలించిన అధికారులు
- పర్యవేక్షించిన పూరీ గజపతి మహారాజు దివ్యసింగ్ దేవ్

భువనేశ్వర్: పూరీ రత్న భాండాగారాన్ని మరోసారి ఓపెన్ చేశారు. రత్న భాండాగారం జాబితాను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన అత్యున్నత స్థాయి తనిఖీ కమిటీ జస్టిస్ బిశ్వనాథ్ రథ్ ఆధ్వర్యంలో 11 మంది సభ్యుల బృందం గురువారం మలి విడత పర్యవేక్షణ కార్యకలాపాలు ప్రారంభించింది. శ్రీ మందిరం సింహద్వారం ఎదుట ఉన్న రథారూఢ మహా ప్రభువును దర్శించుకుని రత్న భాండాగారం తెరిచేందుకు ఉన్నత స్థాయి తనిఖీ కమిటీ సభ్యుల బృందం గురువారం ఉదయం ఆలయంలోకి ప్రవేశించారు. కమిటీ సభ్యులు సంప్రదాయ వస్త్రధారణతో పర్యవేక్షణలో పాల్గొన్నారు. ప్రముఖులు నిర్ధారించిన సుముహూర్తం ఉదయం 9.51 గంటలకు రత్న భాండాగారంలోనికి ప్రవేశించారు. అంతకుముందు విమలా దేవి, శ్రీమహాలక్ష్మీ సమేత పార్శ్వదేవ దేవతలను దర్శనం చేసుకున్నారు. తొలిరోజు స్థానిక కలెక్టర్ ఆధ్వర్యంలో ట్రెజరీలో భద్రపరిచిన తాళం చెవిలు వినియోగించి లోపలి గది తెరిచారు. దీనిలో భద్రపరిచిన ఆభరణాలన్నింటినీ తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే ప్రక్రియ ప్రారంభించారు. ఈ విడతలో స్వయంగా పూరీ గజపతి మహారాజు దివ్య సింగ్ దేవ్ పరిశీలన ప్రక్రియలో పాలుపంచుకున్నారు.

దక్షిణ ద్వారం గుండా

గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ శ్రీమందిరం దక్షిణ ద్వారం గుండా లోనికి ప్రవేశించారు. ఇది రాజమార్గం. సాధారణంగా సేవకునిగా సందర్భించే సందర్భాల్లో రాజావారు అందరిలాగానే శ్రీమందిరం తూర్పు ద్వారం గుండా 22 మెట్ల మార్గంలో ప్రవేశిస్తారు. అయితే ఇతరేతర రాచరిక కార్యకలాపాలు పురస్కరించుకుని దక్షిణ ద్వారం గుండా ప్రవేశించడం ఆచారంగా కొనసాగుతోంది. రాజాధిరాజులు ఈ ద్వారం గుండా స్వామి దర్శనం కోసం ప్రవేశిస్తారు. శ్రీజగన్నాథ స్వామి సంస్కృతితో ముడిపడిన నేపాలు రాజ వంశీకులు దక్షిణ ద్వారం గుండా శ్రీ మందిరంలోనికి ప్రవేశిస్తారు.

ఖొట్టొషెజా గదికి తరలింపు

శ్రీమందిరం రత్న భాండాగారం లోపలి గదిలోకి ప్రవేశించి ఆభరణాలు మరియు విలువైన వస్తువులను ఖొట్టొషెజా అనే గదికి తరలించారు. దీనిలోని ఆభరణాలు భద్రపరిచిన బీరువాలు, చెక్క పెట్టెలు చెక్కుచెదరకుండా ఉన్నట్లు గజపతి మహారాజా తెలిపారు. వాటిని సురక్షితంగా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్నారు. తరలించడం పూర్తయ్యాక బాధ్యతాయుతమైన అధికారుల సమక్షంలో తాళం వేసి సీలు చేస్తారని వివరించారు. అనంతరం భారత పురావస్తు శాఖకు ఈ ప్రాంగణం అప్పగిస్తారన్నారు. వారు రత్న భాండాగారం క్షుణ్ణంగా పరిశీలించి మరమ్మతులు, ఇతరేతర అనుబంధ నిర్వహణ కార్యకలాపాలు చేపడతారని వెల్లడించారు. నిర్వహణ పనులు పూర్తయ్యాక మరలా ఆభరణాలను యథాతథంగా రత్న భాండాగారానికి తరలిస్తారని వివరించారు. ఈలోపు ఆభరణాలు ఒక్కొక్కటిగా లెక్కించి పూర్తి వివరాలు, స్థితిగతులతో సంపూర్ణ జాబితా రూపకల్పన చేస్తారన్నారు. రత్న భాండాగారం పలుచోట్ల దెబ్బ తిన్న ఛాయలు తారసపడుతున్నాయని, సత్వర మరమ్మతుల పనులతో పటిష్ఠమైన కార్యాచరణ అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

పురావస్తు శాఖ పరిశీలనకు

లోపలి గదితోపాటు రత్న భాండాగారంలో మరెన్నో సొరంగాలు ఉన్నట్లు ప్రచారమవుతున్న ఊహాగానాలపై మహారాజు స్పందించారు. భారత పురావస్తు శాఖ రత్న భాండాగారం లోపలి భాగాలు క్షుణ్ణంగా పరిశీలించి ధ్రువీకరిస్తుందని తెలిపారు. ఈ ప్రక్రియలో లేజర్ స్కానింగ్ వంటి అత్యాధునిక కార్యశైలితో ఏఎస్ఐ వర్గాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 1971 సంవత్సరం నుంచి భారత పురావస్తు శాఖ శ్రీజగన్నాథ ఆలయం నిర్వహణ బాధ్యతలను చేపట్టింది. అది మొదలుకొని నేటి వరకు రత్న భాండాగరం లోపలి గది తెరిచి మరమ్మతులు వంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేనట్లు గజపతి మహారాజు స్పష్టం చేశారు. ఈ లెక్కన దీర్ఘ కాలంగా రత్న భాండాగారం ఎటువంటి నిర్వహణ చర్యలకు నోచుకోనట్లు స్పష్టమవుతోంది. 2018 నివేదిక ప్రకారం రత్న భాండాగారం లోపలి భాగాలు దెబ్బ తిన్నాయి. ఇటీవల కాలంలో ఈ పరిస్థితి మరింత దిగజారింది. తాజా పరిస్థితిని విశ్లేషించిన తర్వాత పటిష్ఠమైన కార్యాచరణలో ఏఎస్ఐ వర్గం ముందుకు సాగాలని వారసత్వ పరిశోధకుడు అనిల్ ధీర్ ప్రతిపాదించారు. అయితే భాండాగారంలోని అమూల్యమైన వస్తువులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించిన తర్వాత మాత్రమే ఈ సన్నాహాలు చేయాలని తెలిపారు. ట్రెజరీలో అందుబాటులో ఉన్న అదనపు తాళం చెవులతో రత్న భాండాగారం లోపలి గది తలుపుల తాళాలు తెరుచుకోకపోవడంతో, విరగ్గొట్టి 2 కొత్త తాళాలు వేసిన విషయం తెలిసిందే.

పాములు లేవు

శ్రీమందిరం రత్న భాండాగారంలో పాములు ఉంటాయని రేగిన దుమారం తుస్సుమంది. వాస్తవానికి రత్న భాండాగారం తెరిచినా పాముల ఛాయ కనపడలేదని స్నేక్ హెల్ప్‌లైన్ ప్రముఖుడు సువేందు మల్లిక్ తెలిపారు. తొలిరోజు మాదిరిగానే తమ బృందం ముక్తి మండపం ఆవరణలో చివరి క్షణం వరకు నిరీక్షించిందన్నారు. లోపలి గది తెరిచి సొత్తు తరలించడం పూర్తైనా పాముల జాడ లేనందున తమను లోపలికి అనుమతించలేదని వివరించారు.

సొరంగ మార్గాలు లేవు

లోపలి గదిని తనిఖీ పర్యవేక్షక ఉన్నత స్థాయి కమిటీ బృందం క్షుణ్ణంగా పరిశీలించిందని పర్యవేక్షక కమిటీ అధ్యక్షుడు జస్టిస్ విశ్వనాథ్ రథ్ తెలిపారు. లోపలి గదిలో ఎటువంటి సొరంగ మార్గాలు, రహస్య నిధి, అదనపు గదులు ఇతరేతర వ్యవస్థ ఏమీ లేదని స్పష్టం చేశారు. కొనసాగుతున్న చర్చలు కేవలం వదంతులు మాత్రమేనన్నారు. లోపలి గదిలోని ఆభరణాలు వగైరా సురక్షితంగా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనట్లు వివరించారు. దీని కోసం నిరవధికంగా ఏడున్నర గంటలు శ్రమించినట్లు పేర్కొన్నారు. ఆశించిన మేరకు ఒకే విడతలో లోపలి గదిలోని ఆభరణాలను తరలించి ఖాళీ చేయడం జరిగిందన్నారు. లోపలి గదిలో 3 గాజు బీరువాలు, 1 స్టీల్ బీరువా, 3 చెక్క పెట్టెలు నిండుగా ఉన్నట్లు గుర్తించారు.

కనుల పండువగా..!



బాణలు పగలుగొట్టి పాణకం ఒలకబోస్తున్న దృశ్యం



- ఘనంగా అధర పాణక సేవ
- నేడు రత్న వేదికపైకి స్వామివారు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రథయాత్ర ఎంతో విశిష్టమైనది. యాత్ర ఆద్యంతం సృష్టిలోని ప్రతీ వర్గానికి భగవంతుని దర్శనం సాక్షాత్కరిస్తుంది. కుల, మత, వర్గ, వర్ణ వివక్షకు అతీతంగా మానవాళికి మాత్రమే పరిమితం కాకుండా దేవ, దానవులతో అశరీర శక్తులకు స్వామివారు మోక్షం ప్రసాదించడం ఇక్కడి విశిష్టత. విముక్తి కోసం గింగుర్లు కొట్టే అశరీర వర్గాలు, మోక్షం కోసం పరితపించే చండీ, చాముండీ స్వామివారి కృప కోసం పరితపిస్తుంటాయి. వీరి ముక్తి కోసం అధర పాణక సేవ నిర్వహిస్తారు. స్వామి యాత్ర పూర్తి చేసుకుని రత్న వేదికపైకి తరలిపోయే ముందు రోజు గురువారం సంధ్యా సమయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రథయాత్రలో పవిత్ర ఆషాఢ శుక్ల ద్వాదశి పురస్కరించుకుని రథారూఢ శ్రీవిగ్రహాల దగ్గర అధర పాణక సేవ ప్రత్యేకం. రథాలపై మూల విరాటుల అధరాల ఎత్తున నిలువెత్తు బాణల్లో పాణకం నింపి నివేదించారు. దేవతలకు నివేదించిన తర్వాత పాణకంతో నిండిన బాణలను పగులుగొడితే పాణకం రథాల పైనుంచి నేలకు పొరులుతుంది. ఈ పాణకం అసుర, అశరీర శక్తులకు ఉద్దేశించబడినదిగా చెబుతారు. సింహద్వారం ఆవరణ ఛవుణి మఠం ప్రాంగణంలో నూతి నుంచి నీటిని వినియోగించి పాణకం తయారు చేశారు. ఇంతకు ముందు రాధా వల్లభ మఠం బావి నీటిని వినియోగించే వారు. పాణియా ఒపాటొ వర్గం సేవకులు బావి నుంచి నీటిని తరలించారు.

9 బాణల్లో పాణకం

శ్రీ మందిరం ఆవరణలో నిలిచిన 3 రథాలపై ఒక్కో మూల విరాట్ ఎదురుగా 3 చొప్పున 9 నిలువెత్తు బాణలు సిద్ధం చేసి పాణకంతో నింపారు. ఈ ప్రక్రియ తెర చాటున నిర్వహించారు. మహా సువార్ సేవకుల సమక్షంలో భిత్తొ రొచ్చొ, తొలుచ్చొ, పాలియా పుష్పాలక్ వర్గం సేవకులు పాణకం తయారీలో సాయం అందజేశారు. పత్రిబొడు, సువారుబొడు, గొరాబొడు పాలియా సేవకులు పూజాదులు ముగించిన తర్వాత పలియా పూజా పండా సేవకులు పంచోపచార పూజలు చేసి దేవతలకు పాణకం నివేదించారు.

సుగంధ ద్రవ్యాలతో పాణకం

అరటి పండ్లు, పాల మీగడ, కర్పూరం, జాజికాయ, యాలకులు, మిరియాల పొడి, కర్పూరం, ఛెన్నా పదార్థాలతో అధర పాణకం తయారు చేశారు. శ్రీమందిరం, రాఘవ్ దాస్ మఠం మరియు ఒడియా మఠం పాణకం తయారీకి అవసరమైన సామగ్రి సరఫరా చేసింది.

కుదించుకుపోతున్న ఆచారం

లోగడ అధర పాణక సేవ వరుసగా 3 రోజులు నిర్వహించడం ఆచారంగా కొనసాగింది. బహుడా దశమి నాడు రథాలు శ్రీమందిరం సింహ ద్వారం ముంగిటకు చేరడంతో ఈ సేవ ప్రారంభించి నీలాద్రి విజే ముందు రాత్రి వరకు నిరవధికంగా నిర్వహించే అధర పాణకం సేవ ప్రస్తుతం ఒక్కరోజుకు మాత్రమే పరిమితమైపోయింది. ప్రస్తుతం రథాలపై ఉత్సవ ప్రతిమల కోసం ప్రత్యేక బాణల ఆచారం కనుమరుగైపోయింది. మూల విరాటుల కోసం పెద్ద బాణలు, ఉత్సవ మూర్తుల కోసం చిన్న మట్టి పాత్రల్లో పాణకం నింపి అధర పాణక సేవ నిర్వహించడం జరిగేదని శ్రీజగన్నాథ తత్వ పరిశోధకుడు డాక్టర్ సురేంద్ర కుమార్ మిశ్రా తెలిపారు.

కిడ్నాప్ కేసులో 13 మంది అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

- నిందితుల నుంచి రూ.24.85 లక్షలు స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డబ్బు ఇతర వస్తువులు

జయపురం: ఈనెల 12వ తేదీన జరిగిన అంధవరపు రమేష్ కిడ్నాప్ కేసులో 13 మంది నిందితులను బొరిగుమ్మ పోలీసులు అరెస్టు చేసినట్లు బొరిగుమ్మ సబ్ డివిజనల్ పోలీసు అధికారి తపశ్వినీ కొహార్ గురువారం వెల్లడించారు. అరెస్టైనవారు జయపురం క్రిస్టియన్ పేటకు చెందిన అభిజీత్ మహురియ, రోహిత్ సున, మీనాక్షి మహురియ, ప్రవీణ్ మహురియ, తరుణమ్ బేగం, రోషణం బాగ్, పారాబెడ కాలనీకి చెందిన ఒక వ్యక్తి, ఇరిగేషన్ కాలనీ సమీప జమునగుడకు చెందిన ఫిరోజ్ నాగ్, సునాబెడ గంజాం కాలనీకి చెందిన సంతోష్ బెనియ, కుందులి గ్రామానికి చెందిన జునేష్ పదసెట్టి, డొంగాగుడకు చెందిన ప్రసాద్ ఖిల్లా, బండాగాట్‌కు చెందిన దాము నాయిక్, ముండి పాదర్‌కు చెందిన రఘునాత్ హరిజన్‌లు ఉన్నట్లు వెల్లడించారు. నిందితుల నుంచి రూ.24.85 లక్షలు, బాధితుడి కారు, నిందితులకి చెందిన రెండు కార్లు, ఒక బైక్, రెండు కత్తులు, రెండు పిస్టల్‌లు, బాధితుడి సెల్‌ఫోన్, నిందితులకు చెందిన 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఇదీ విషయం...

వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 12వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో పెరహండి గ్రామంలోని రైసు మిల్లు యజమాని ఎ.రమేష్ పాత్రో తన కారులో తాను నివాసముంటున్న కుమిలిపుట్‌కు బయల్దేరాడు. అదే సమయంలో అతడిని మిల్లు నుంచి నలుగురు వ్యక్తులు ఒక కారులో వెంబడిస్తూ వచ్చారు. కొంత దూరం వెళ్లాక మరో నలుగురు మరో కారులో రమేష్ కారుకి అడ్డంగా వచ్చి రోడ్డు బ్లాక్ చేసి కారుని ఆపారు. వారంతా మాస్కులు ధరించారు. రమేష్ కారు అద్దాలు పగల గొట్టి కారులో ఉన్న రమేష్‌ను బయటకు లాగారు. అనంతరం వారు బాధితుడిని గుర్తు తెలియని ప్రాంతానికి బలవంతంగా తీసుకుపోయారు. అక్కడ నుంచి రమేష్ సోదరుడు ఆనందరావుకి ఫోన్‌చేసి రూ.90 లక్షలు డిమాండ్ చేశారు. చివరికి రూ.70 లక్షలకు ఒప్పుకున్నారు. డబ్బు వెంటనే ఇవ్వాలని లేదంటే రమేష్‌ను చంపుతామని హెచ్చరించారు. అయితే రమేష్‌ను విడిచిపెట్టేందుకు అతడి కుటుంబ సభ్యులు రూ.25 లక్షలు వారికి అందజేశారు. అనంతరం మిగిలిన డబ్బులు ఇస్తామని ఒప్పుకున్నారు. అదే సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 14వ తేదీన రమేష్‌ను సెమిలిగుడ సమితి ఆర్.మాలిగుడ ప్రాంతంలో పోలీసులు కనుగొని రక్షించి ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం దర్యాప్తు చేపట్టగా నిందితులు పట్టుబడ్డారు. నిందితుల్లో అభిజీత్ మహురియపై జయపురంలో 12 కేసులు ఉన్నాయని, అలాగే ప్రసాద్ ఖిల్లాపై 4 కేసులు, సంతోష్ బెనియపై 4 కేసులు, ఫిరోజ్ నాగ్‌పై ఒక కేసు, జునేష్‌పై 2 కేసులు, ప్రవీణ్, మీనాక్షీలపై ఒక్కొక్క కేసు, ప్రభీణ మహురియపై రెండు కేసులు ఉన్నట్లు విలేకరుల సమావేశంలో పోలీసులు వెల్లడించారు. సమావేశంలో జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ, బొరిగుమ్మ పోలీసు అధికారి జుగుల్ కిశోర్ షా, జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి తదితరులు పాల్గొన్నారు.

మార్గం సుగమం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆందోళన చేపడుతున్న బాధితులు

- కంసారిగుడలో కర్మాగారం ఏర్పాటు
- మూడేళ్లలో ఉత్పత్తి ప్రారంభించేందుకు సన్నాహాలు
- ఆర్‌డీసీ ఆర్ఎస్ గోపాలన్ వెల్లడి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌లో మరో బృహత్తర పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమమయ్యింది. దక్షిణాంచల్ రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (ఆర్‌డీసీ) ఆర్ఎస్ గోపాలన్ ఈ మేరకు స్పష్టం చేశారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం జరిగిన రీహేబిలిటేషన్ అండ్ ఫెరిఫెరీ డవలప్‌మెంట్ అడ్వైజరీ కమిటీ (ఆర్‌పీడీఏసీ) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాసీపూర్ సమితి కంసారిగుడలో సుమారు రూ.8 వేల కోట్ల వ్యయంతో హిండల్ కో ఇండ్రస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో అలూమిన రిఫైనరీ కర్మాగారం ఏర్పాటుకు సంబంధించి 2005 నుంచి సన్నాహాలు చేపడుతున్నా పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఎట్టకేలకు అందరి అనుమతితో ఆ ప్రాంతంలో కర్మాగారం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా ప్రభావిత ప్రాంతంలో కర్మాగారం ఏర్పాటుకు సంబంధించి భూములు, వసతులు కోల్పోయే నిర్వాసిత బాధితుల సమస్యలను సుదీర్ఘంగా చర్చించి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేకూరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏళ్ల గడుస్తున్నా ఈ ప్రాంతంలో కర్మాగారం ఏర్పాటుకు కొన్ని అనివార్య కారణాల వల్ల అటంకాలు ఏర్పడ్డాయని వివరించారు. అయితే గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో కర్మాగారం ఏర్పాటుకు సంబంధించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. అయితే ఈ కర్మాగారం ఏర్పాటుకు సంబంధించి ఇకపై ప్రతీ ఆరు నెలలకొసారి ఆర్‌పీడీఏసీ సమావేశం నిర్వహించేందుకు ఆదేశించడం జరిగిందన్నారు. ముఖ్యంగా కర్మాగారానికి సంబంధించి యాజమాన్యం ఎప్పటికప్పుడు పూర్తి వివరాలను తెలియజేయాలని, అదేవిధంగా నిర్వాసితులను ఆదుకునేందుకు ఎటువంటి చర్యలు, ప్రణాళికలు రూపొందిస్తుందో వెల్లడించాలని సూచించారు. అనంతరం ప్రభావిత ప్రాంతాలకు చెందిన బాధితుల ప్రతినిధులు, అధికారులతో చర్చించారు.

హర్షణీయం

కంసారిగుడలో కార్మాగారం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలియజేయడం హర్షించదగ్గ విషయమేనని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 2005–06లో కర్మాగారం ఏర్పాటు చేస్తామని కంసారిగుడ సమీప గ్రామాలకు చెందిన ప్రజల నుంచి స్థల సేకరణ చేశారన్నారు. అయితే సుమారు రెండు దశాబ్దాలు గడిచినా ఇంతవరకు పనులు ముందుకు సాగలేదని, దీంతో భూములు ఇచ్చిన రైతులు చాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో నష్ట పరిహారం కింద ప్రతీ ఎకరాకి రూ.2.3 లక్షలు బాధితులకు కంపెనీ అందించి చేతులు దులుపుకుందన్నారు. అయితే ఇన్నేళ్లు ఉపాధి లేక నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం ప్రస్తుత ధర ప్రకారం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

వలసలు నివారించాలి

రాయగడ జిల్లాలో ఉపాధి లేకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తుండడం పరిపాటిగా మారిందని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక అన్నారు. ముఖ్యంగా కాసీపూర్ ఖనిజ సంపదలకు నిలయంగా ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువై ఎంతోమంది ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడ మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాసీపూర్‌లో ఉత్కళ అలూమిన కర్మాగారం ఉన్నప్పటికీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కంపెనీ యాజమాన్యం నిరుద్యోగ యువతను ఆదుకొని, వలసలు నివారించాలని కోరారు. అదేవిధంగా కొత్తగా ఏర్పాటు కానున్న కర్మాగారంలోనూ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. అలాగే కాసీపూర్ సమితిలో ప్రతీ ఏడాది వివిధ రోగాల బారినపడి ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని గుర్తు చేశారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ, అటు పరిశ్రమలు గానీ ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇటువంటి పరిస్థితి తలెత్తిందన్నారు. ఇప్పటికైనా అందరూ స్పందించి ఈ సమస్యకు తెరదించాల్సిన అవసరం ఉందన్నారు.

సీఎస్ఆర్ ద్వారా సౌకర్యాలు

కాసీపూర్ సమితి టికిరిలోని ఉత్కళ అలూమిన కర్మాగారం ద్వారా కార్పొరేటివ్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద కర్మాగారం సమీపంలోని వివిధ గ్రామాల్లో ప్రజలకు మౌళిక సౌకర్యాలు కల్పిస్తున్నామని కర్మాగారం సీఈవో మజార్ బేగ్ వివరించారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎస్ఆర్ ద్వారా చేపడుతున్న వివిధ సంక్షేమ ప్రాజెక్టుల గురించి వివరించారు. ఏదిఏమైనప్పటికీ ఈ ప్రాంతంలోనూ కంపెనీ ద్వారా మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న బాధిత ప్రతినిధుల సమస్యలను ఆర్‌డీసీ విన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. అయితే కొంతమంది బాధితులను సమావేశానికి అనుమతించకపోవడంపై వారు నిరసన తెలిపారు. అసలైన బాధితులను సమావేశానికి ఆహ్వానించకుండా, కంపెనీ దళారులను పిలిచి చర్చించడం ఏమాత్రం సమంజసంగా లేదన్నారు. ఆర్‌డీసీ కాన్వాయిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని వారిని బుజ్జగించారు. సమావేశంలో కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్, ఎస్పీ అవినాష్ శంకర్, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర సావుంత, కొరాపుట్, రాయగడ జిల్లా పరిషత్‌ల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రయాణానికి పాట్లు



గుమ్మగెడ్డ వద్ద చెరువులా మారిన రోడ్డు

పర్లాకిమిడి: పర్లాకిమిడి – రాణిపేట మార్గం లోని గుమ్మగెడ్డ వద్ద రోడ్డుపై పెద్ద గంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచిపోతోంది. దీంతో కొరాపుట్, రాయగడ జిల్లాల నుంచి వస్తున్న బస్సులు, ద్విచక్ర వాహనాలు గుంతల్లో పడి పోయి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అందువలన అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాజ్ భవన్ ఎదుట బీజేడీ నిరసన



ఆందోళన చేపడుతున్న బీజేడీ కార్యకర్తలు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ అధికారిపై గవర్నర్ రఘుబర దాస్ కుమారుడు అమానుషంగా దాడి చేయడంపై బిజూ జనతా దళ్ పార్టీ రాజ్ భవన్ ఎదుట గురువారం ఆందోళనకు దిగింది. పూరీ జగన్నాథుని రథయాత్ర పురస్కరించుకుని అక్కడి రాజ్‌భవన్‌లో విధి నిర్వహణలో ఉన్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌ఓ) బైకుంఠ ప్రధాన్‌పై గవర్నర్ కుమారుడు తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచాడు. ఈ చర్యపై ఇంతవరకు ఎటువంటి చర్య చేపట్టనందున విపక్ష జనతా దళ్ యువజన, విద్యార్థి శాఖలు ఆందోళనకు చేపట్టాయి. నిందితుడికి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు.

విస్తారంగా వర్షాలు



పర్లాకిమిడిలో వర్షం కురుస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం ఉదయం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్నాయని ఐఎండీ అధికారులు తెలియజేశారు. రాయగడ, గజపతి, కొరాపుట్, మల్కన్‌గిరిలో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. వర్షాలు కురవడంతో ఖరీఫ్ పంట వేయడానికి రైతులు ఉత్సాహం చూపిస్తున్నారు.

'లాకౌట్ ఆలోచన లేదు'

టెక్కలి: రావివలస ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమ ఉత్పత్తిపై మార్కెట్‌లో నష్టాలు ప్రభావం చూపడంతో ఈ నెల 31న చివరి పనిదినంగా నోటీసులు జారీ చేశామని, ఎటువంటి లాకౌట్ ఆలోచన లేదని కంపెనీ ప్రతినిధులు తెలియజేసినట్లు జిల్లా పరిశ్రమల శాఖాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ పరిస్థితుల్లో లాభాల పరిస్థితులు చోటు చేసుకుంటే మళ్లీ పరిశ్రమ తెరిచి కార్మికుల సేవలను కొనసాగిస్తామని ప్రతినిధులు వెల్లడించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొత్తపేటలో విద్యుత్ షాక్‌కు గురై గంటా పోలయ్యకు చెందిన పాడి ఆవును మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తుండగా కంచె లేకపోవడంతో షాక్ గురై మృతి చెందిందని, దాదాపు రూ.50వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

కుక్కదాడిలో బాలుడికి గాయాలు

ఆమదాలవలస: మండలంలోని చిన్నజొన్నవలస నిర్వాసిత కాలనీకి చెందిన చల్ల రతీష్‌పై గురువారం కుక్క దాడి చేసింది. కాలు, చేతులపై తీవ్ర గాయాలు కావడంతో బాలుడిని తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించారు.

సీవీఆర్ అకాడమీకి వివేక్ ఎంపిక



వివేక్ అమృత్ నారాయణ్ మంగి

పాతపట్నం: మండలంలోని చంగుడి గ్రామానికి చెందిన వివేక్ అమృత్ నారాయణ్ మంగి ప్రఖ్యాత సి.వి.రామన్ సైన్స్ రీసెర్చ్ అకాడమీకి ఎంపికయ్యాడు. వివేక్ తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎం.ఎస్.ఇండస్ట్రి మైక్రో బయాలజీ పూర్తి చేశాడు. డెంగీ వైరస్ అనే అంశంపై పరిశోధన పత్రం పంపించినట్లు తండ్రి ఎం.రామారావు గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు.

ఆహార కేంద్రం పరిశీలన

భువనేశ్వర్:

రాష్ట్ర గృహ, నగర అభివృద్ధి శాఖ మంత్రి కృష్ణచంద్ర మహాపాత్రో స్థానిక క్యాపిటల్ ఆస్పత్రి ఆవరణలోని ఆహార కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. దీనిలో భాగంగా ఒక కూపన్ కొనుగోలు చేసి ప్రజలతో కలిసి భోజనం చేశారు. ప్రజలతో మాటామంతీ చేస్తూ ఆహార నాణ్యత, ఆహార కేంద్రంలో వారి సమగ్ర అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఆహార కేంద్రంలో పరిశుభ్రత, ఆహార నాణ్యత ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ ప్రాంగణంలో పాడైన డిష్ వాషింగ్ మిషన్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆహార్ యోజన కొనసాగుతుందని ధ్రువీకరించారు. భవిష్యత్‌లో పథకం పేరుపై సమీక్ష నిర్వహించవచ్చన్నారు. పెరుగుతున్న ఖర్చులను పరిగణనలోకి తీసుకొని, నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళలను సేవలో భాగస్వాములను చేయాలని యోచిస్తున్నామన్నారు. ప్రభుత్వం భోజనానికి సబ్సిడీ ఇస్తుందని, దీనిలో ప్రభుత్వం వాటా రూ.23లు, ప్రజల వాటా రూ.5లుగా మంత్రి పేర్కొన్నారు. 2015 సంవత్సరం ఉత్కళ దివస్ పురస్కరించుకొని ఏప్రిల్ 1వ తేదీన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రవేశపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆహార పథకం 115 పట్టణ ప్రాంతాల్లో 168 కేంద్రాల్లో కొనసాగుతోంది. అన్ని కేంద్రాలు, వంటశాలలు ఐఎస్‌ఓ సర్టిఫైడ్ మరియు జియో లింక్ చేయబడ్డాయి. 61 కేంద్రాల్లో రాత్రి భోజనం కూడ లభిస్తుంది. ఈ పథకం ద్వారా రోజుకు లక్ష మంది భోజనం చేస్తున్నారు.



ప్రజలతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి కృష్ణచంద్ర మహాపాత్రో

భగ్గుమన్న విశ్రాంత కార్మికులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ మహంతి



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత శ్రామికులు

జయపురం: తమకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో సేవా పేపర్ మిల్లు యాజమాన్యంపై విశ్రాంత కార్మికులు మండిపడ్డారు. స్థానిక యాదవ భవనంలో పేపర్ మిల్లు విశ్రాంత కార్మికుల సమావేశం గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా మిల్లు ప్రధాన అధికారి ఎస్.ఎస్.పాల్ తనతో జరిపిన చర్చల అంశాలను శ్రామిక నేత ప్రమోద్ మహంతి వివరించారు. విశ్రాంత కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు, పీఎఫ్, పెన్షన్, గ్రాచ్యుటీలపై మాట్లాడితే పేపర్ మిల్లు అధికారి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మిల్లు యాజమాన్యం బాధ్యతారహిత చర్య అని దుయ్యబట్టారు. ఈ విషయంపై మరోసారి జయపురం సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్లను కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. అలాగే త్వరలో అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కార్మిక, పరిశ్రమల మంత్రులను కలవాలని తీర్మానించారు. సమావేశంలో కార్మిక నేతలు బసంత బెహర, ప్రహ్లాద్ మల్లిక్, ధ్రువ మల్లిక్, ధ్రువ బారిక్, ఆర్.కె.మహారాణ, పి.ప్రభాకరరావు, ఘెనువ హరిజన్, రమేష్ గోండ్ తదతరులు పాల్గొన్నారు.

మరోసారి ఇసుక నిల్వల లెక్కింపు



అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద డిజిటల్ సర్వే చేస్తున్న మైన్స్ సిబ్బంది

కొత్తూరు: మండలంలోని అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక నిల్వలను మైన్స్ అధికారులు డిజిటల్ సర్వే ఆధారంగా గురువారం లెక్కించారు. ఇక్కడ ఈ నెల 8 నుంచి ఇసుక అమ్మకాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అప్పట్లో 35020 క్యూబిక్ మీటర్ల ఇసుక స్వాధీనం చేసుకున్న మైన్స్ అధికారులు రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అప్పుడు మాన్యువల్‌గా ఇసుక లెక్కింపు జరిగినందున ప్రస్తుతం ఇసుక నిల్వ ఎంత ఉందనేది కచ్చితంగా తెలుసుకునేందుకు డిజిటల్ సర్వే చేపట్టినట్లు మైన్స్ సర్వేయర్ ప్రసాదరావు చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 2 వేల టన్నుల ఇసుక విక్రయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రమణయ్య పాల్గొన్నారు. కాగా, ఇసుకపై కొందరు టీడీపీ నేతలు కన్నువేసినందున అధికారులు ముందస్తుగా సర్వే చేపట్టినట్లు తెలిసింది.

డ్రైవర్లకు తప్పని కష్టాలు..

ఇసుక ర్యాంపు వద్ద ట్రాక్టర్ డ్రైవర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం ఆరు గంటలకు ర్యాంపు వద్దకు వచ్చినా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు. లోడులు వేసిన అద్దెలు గిట్టుబాటు కావడం లేదన్నారు. మరోవైపు వర్షాలు కురుస్తున్నందున భోజనాలు చేసేందుకు కూడా అవస్థలు తప్పడం లేదని, ట్రాక్టర్ కింద బురద మధ్యే తినాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి మరో జేసీబీని లోడింగ్‌కు ఉపయోగించాలని పలువురు డ్రైవర్లు కోరుతున్నారు.

21న జిల్లా చెస్ ఎంపిక పోటీలు



చెస్ సాధనలో చిన్నారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్–11 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఈ నెల 21న జరగనున్నాయని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్ గురువారం తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని నానుబాలవీధిలో ఉన్న చెస్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఎంపికల ప్రక్రియ ప్రారంభమౌతుందని చెప్పారు. 2013 జనవరి ఒకటి తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని స్పష్టంచేశారు. ఎంపికైన వారు ఈ నెల 27, 28 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి అండర్–11 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతోపాటు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి ఎంపికల్లో పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు 74168 64642 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'అనాథలకు రిజర్వేషన్లు కల్పించాలి'



మాట్లాడుతున్న జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి తదితరులు

పర్లాకిమిడి: అనాథ బాలబాలికలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని జెడ్పీ చైర్మన్ గవర తిరుపతి రావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్‌సమావేశ మందిరంలో 'అనాథ బాలలతో ఒక్కరోజు' అనే కార్యక్రమం జిల్లా యంత్రాంగం, జిల్లా శిశు సంరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక శిశు సంరక్షణ కేంద్రం నుంచి దత్తతగా వెళ్లిన చిన్నారులు దేశ, విదేశాల్లో సంతోషంగా ఉన్నారన్నారు. ఇంకా ఈ సంస్థను అభివృద్ధి చేయాలని కోరారు. దీనిలో భాగంగా దేశ, విదేశాల్లో ఉన్న దత్తత పిల్లలతో అధికారులు మాట్లాడారు. జిల్లా సలోమ్ దత్తత కేంద్రంలో ప్రస్తుతం 17 మంది బాలబాలికలను చేరదీసి వారికి ఉచిత విద్యను అందిస్తున్నామని, వీరిలో 16 మంది కోసం కేంద్ర దత్తత పోర్టల్‌లో పలువురు దత్తత నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని డీసీపీయూ అరుణ్ త్రిపాఠి తెలిపారు. మొత్తం గజపతి జిల్లాలో ఇప్పటివరకు 181 మంది అనాథ బాలబాలికలను చేరదీసి సంరక్షించామన్నారు. వారిలో 178 మందికి తల్లిదండ్రులు లేరని పేర్కొన్నారు. 140 మందికి నెలకు రూ.4 వేల చొప్పున పోషణ, చదువు నిమిత్తం అందిస్తున్నామని, అలాగే 34 మంది బాలలకు ఉన్నత విద్య అందిస్తున్నామని వెల్లడించారు. కరోనాలో తల్లిదండ్రులను కోల్పోయిన బాలలు 188 మందికి రూ.1500లు చొప్పున్న ఆశీర్వాద్ పథకం కింద అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి కుమార్, పురపాలక సంఘం చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్, డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

చేయూత జాబితాలు సిద్ధం చేస్తున్నాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడతకు సంబంధించి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలందరికీ అందజేశామని డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ గురువా రం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలలో కొంతమందికి నగదు జమకాలేదని, సచివాలయాల నుంచి జాబితాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. జాబితాల సేకరణకు సంబంధించి మౌఖిక ఆదేశాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు.

నేటి నుంచి బీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని 14 బీఎడ్ కళాశాలల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. పలాస, టెక్కలి, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకు ళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, రాజాం జీసీఎస్‌ఆర్, పాలకొండ తమ్మినాయుడు కళాశాల వేదికగా ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 1220 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు.

మహోన్నత శక్తిగా 'రెడ్‌క్రాస్'



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో రెడ్‌క్రాస్ మహోన్నత శక్తిగా ఎదిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా రక్తదాన శిబిరాలు, నేత్ర సేకరణ, ఉచితవైద్యం, మెడిసిన్ బ్యాంకు ద్వారా ఉచితంగా మందులు అందించడం, ఉచిత అంబులెన్సు సర్వీసు, పర్యావరణ సంరక్షణకు మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వర రావు వార్షిక నివేదికను చదివి వినిపించారు. సేవా కార్యక్రమాల ఫొటో ఎగ్జిబిషన్‌ను జేసీ ప్రారంభించారు. రక్తదాతలు, ఇతర ప్రతినిధులను సత్కరించారు. అనంతరం జేసీ, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావులను సన్మానించారు. ఈ సందర్భంగా శివశ్రీ నృత్య నికేతన్ దర్శకులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, కూన ప్రమీల, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికా రి చెన్నకేశ్వరరావు, పి.రజనీకాంత రావు, పి.చైతన్యకుమార్, పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



మెరిట్ విద్యార్థులతో డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, అధికారులు

- ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ వెంకట గోపాల ధనబాలాజీ
- పీయూసీ పూర్తిచేసిన 978 మంది విద్యార్థులకు ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల కేటాయింపు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అన్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) పూర్తిచేసుకున్న విద్యార్థులకు గురువారం ఇంజినీరింగ్ సీట్లు కేటాయించారు. 978 మంది విద్యార్థులకు పీయూసీ మార్కులు, ఎంచుకున్న ఆప్షన్, విద్యార్థులు రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా బ్రాంచ్‌లు కేటాయించారు. జిల్లా క్యాంపస్‌లో సీఎస్ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ట్రిపుల్ఈ బ్రాంచ్‌లు ఉన్నాయి. ఆర్‌జీయూకేటీలో సమీకృత ఇంజినీరింగ్ కోర్సు ఆరేళ్లు కాగా, రెండేళ్ల పీయూసీ, నాలుగేళ్ల ఇంజినీరింగ్ క్లాస్ వర్కు నిర్వహిస్తారు. పీయూసీలో మొదటి ఐదు స్థానాల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ఇంజినీరింగ్ ప్రవేశాలు అందజేసిన డైరెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కమ్యూనికేషన్ స్కిల్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, లాంగ్వేజ్ స్కిల్స్‌పై పట్టు సాధించాలన్నారు. విషయ పరిజ్ఞానం, పారిశ్రామిక అవసరాలను అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, అధికారులు పాల్గొన్నారు.

ఆలోచన అదిరింది.. ప్రయోగం ఫలించింది



పాత దిబ్బలపాలెంలో ప్రయోగించిన రీ-లాండింగ్ రాకెట్ ప్రయోగం

- రాకెట్ రీ ల్యాండింగ్‌పై పరిశోధనలు
- అంబేడ్కర్ వర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థుల ఘనత
- తక్కువ ఖర్చు.. పునర్వినియోగమే లక్ష్యంగా ప్రయోగం
- వెల్లువెత్తుతున్న అభినందనలు

ఎచ్చెర్ల క్యాంపస్ :

పరిశోధనల్లో రాకెట్ ల్యాండింగ్ టెక్నాలజీ అనేది కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఈ ప్రక్రియలో కోట్లాది రూపాయల ఖర్చుతో రూపొందించిన రాకెట్ ప్రయోగం పూర్తయ్యాక సముద్రంలో పడిపోతుంది. ఎంతో వ్యయంతో రూపొందించిన రాకెట్ ఇలా నిరుపయోగంగా సముద్రజలాల్లో పడకుండా.. జనాలు లేని ప్రాంతాల్లో సురక్షితంగా పడి మళ్లీ వినియోగంలోకి తీసుకురావటం అనే అంశంపై ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఏపీజే అబ్దుల్ కాలాం ఇంజినీరింగ్ కాలేజ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ మూడో ఏడాది చదువు ఉన్న విద్యార్థులు దృష్టిపెట్టారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన రీసెర్చ్ హబ్‌లో పరిశోధన కొనసాగించారు. ప్రయోగానికి స్పేస్ ప్రొపెలాంట్ స్పెషమెన్ టెస్ట్‌గా(ఎస్‌పీఎస్‌టీ)గా నామకరణం చేశారు. విద్యార్థుల ప్రయోగాన్ని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ 'ఎక్స్' ద్వారా అభినందించారు. తక్కువ ఖర్చుతో రీ-ల్యాండింగ్ సాంకేతికతతో రూపొందించిన రాకెట్ ప్రయోగం విద్యార్థుల ప్రతిభగా కొనియాడారు. భవిష్యత్తులో విద్యార్థుల ప్రయోగానికి తోడ్పాటు ఉంటుందని హామీ ఇచ్చారు.



ప్రయోగ దశలో రీ-ల్యాండింగ్ రాకెట్ స్పేస్ ప్రొపెలాంట్ స్పెషమెన్ టెస్ట్ పరిశోధన

బీచ్‌లో ప్రయోగం..

ఇంజినీరింగ్ విద్యార్థి బైరెడ్డి జయంత్‌కు మెకానికల్ ఇంజినీరింగ్ మొదటి ఏడాదిలోనే రాకెట్ ల్యాండింగ్ ఆలోచన వచ్చింది. తోటి విద్యార్థులు అబూసోలామ్, గౌరీశంకర్, లక్ష్మణ్, వినయ్, విజయ్‌లతో తన ఆలోచనను పంచుకున్నారు. మెకానికల్ హెడ్ డాక్టర్ ఎన్.మధులత సైతం పలు సూచనలు చేశారు. రెండేళ్ల ప్రయోగ పరిజ్ఞానంతో తాము తయారుచేసిన రీ ల్యాండింగ్ టెక్నాలజీ రాకెట్‌ను బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం బీచ్‌లో ఇటీవల ప్రయోగించారు. వీరు అనుకున్నట్టే ప్రయోగం విజయవంతమైనట్లు బృందం సభ్యులు చెప్పారు. ఇందుకు తమ వద్ద ఉన్న రూ. 50 వేలు ఖర్చుచేసినట్లు వివరించారు.

విషయం:

సాధారణంగా రాకెట్ నింగిలోకి ఎగిరిన తర్వాత ప్రధాన భాగం మినహా మిగిలిన రాకెట్ భాగంగా కొద్దిసేపటి తర్వాత సముద్రంలో కూలిపోతుంది. కోట్లాది రూపాయల వ్యయంతో తయారయ్యే ఈ రాకెట్ భాగం ఇలా సముద్రంలో పడిపోవడం వల్ల నిరుపయోగంగా మారుతోంది. అదే ప్రజలకు హాని కలగకుండా సురక్షితంగా భూభాగంపైనే పడితే మళ్లీ ప్రయోగానికి ఉపయోగించుకోవచ్చు. ఇదే లక్ష్యంతో అంబేడ్కర్ వర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రయోగం చేసి విజయం సాధించారు.

చేసిందెవరు:

టీమ్ లీడర్‌గా మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి బైరెడ్డి జయంత్. తోటి విద్యార్థులు అబూసోలామ్, గౌరీశంకర్, లక్ష్మణ్, వినయ్, విజయ్ సహకరించారు. మెకానికల్ హెడ్ డాక్టర్ ఎన్.మధులత సైతం పలు సూచనలు చేశారు.



విద్యార్థులతో అప్పటి వీసీ వెంకటరావు

అనవసర ఖర్చు నుంచి విముక్తి

స్పేస్ రీసెర్చ్ అంటే ఎనిమిదో తరగతి నుంచే ఆసక్తి. ఇంజినీరింగ్‌లో చేరాక తోటి విద్యార్థులలో నా ఆలోచన పంచుకున్నాను. వారు కూడా విలువైన సూచనలు చేశారు. అందరం కలిసి హెచ్‌ఓడీ సహకారంతో రూ.50 వేలు ఖర్చు చేసి ఎస్‌పీఎస్‌టీ రీ-ల్యాండింగ్ సాంకేతికతతో రాకెట్ రూపొందించాం. పాత దిబ్బలపాలెంలో ప్రయోగం చేశాం. ఒకసారి వినియోగించిన రాకెట్ మళ్లీ వినియోగంలోకి తీసుకొస్తే ఖర్చు తగ్గుతుంది. మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు చాలా డబ్బు ఆదా అవుతుంది.

– బైరెడ్డి జయంత్, టీమ్ లీడర్

క్లుప్తంగా

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు చింతలపేట విద్యార్థి



యమునను అభినందిస్తున్న హెచ్‌ఎం గౌరీదేవి, పీఈటీ లక్ష్మణ్

గుర్ల: మండలంలోని చింతలపేట హైస్కూల్ విద్యార్థిని మజ్జి యమున జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైందని పాఠశాల పీఈటీ కె.లక్ష్మణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన సౌత్‌జోన్ త్రోబాల్ పోటీలలో రాణించడంతో పాటు ఉత్తమ క్రీడా నైపుణ్యం కనబర్చిందని చెప్పారు. దీంతో రాష్ట్రం తరఫున త్రోబాల్ పోటీలకు ఆమెను ఎంపిక చేశారని, ఆగస్టు 1,2,3 తేదీలలో కర్ణాటక రాజధాని బెంగళూరు లో జరిగే జాతీయస్థాయి పోటీలలో ఆమె పాల్గొననున్నట్లు పీఈటీ తెలిపారు. ఈ సందర్భంగా యమునను హెచ్‌ఎం డి.గౌరీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



పతకాలు సాధించిన పి.జ్యోషికశ్రీ, ఎన్.రోహిత శాన్వీ

పార్వతీపురం టౌన్: విజయనగరంలో నిర్వహించిన టీబా ప్లెసిట్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పార్వతీపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కోచ్ ఆకుల నాని గురువారం తెలిపారు. అండర్ 11 మహిళల సింగల్స్ విభాగంలో పి.జ్యోషిక శ్రీ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. అలాగే అండర్ 11 మహిళల డబుల్స్ విభాగంలో పి.జ్యోషికశ్రీ, ఎన్.రోహిత శాన్వీలు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారని వివరించారు.

జనపనార కనీస మద్దతు ధర రూ.6,035

పార్వతీపురంటౌన్: జనపనార కనీస మద్దతు ధరను రూ.6035గా నిర్ధారించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని ప్రాంతీయ కార్యాలయం అధికారి ఆర్. అరుణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా ది జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, అగ్రికల్చర్ మార్కెట్ యార్డు వద్ద కనీస మద్దతు ధర వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. జూట్ ప్రాంతీయ కార్యాలయం అగ్రికల్చర్ మార్కెట్ యార్డు రాయగడ రోడ్ ఆఫీస్ వద్ద, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బొబ్బిలి వద్ద జనపనార రైతులకు సబ్సిడీపై అందజేసే విత్తన కేంద్రాలు అందుబాటులో ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ మార్కెటింగ్ మేనేజర్ కె.రామ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు జాతీయ ఉపకారవేతనాలు

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ద్వారా 2024-25 విద్యాసంవత్సరానికి విభిన్న ప్రతిభావంతు(దివ్యాంగులు)లకు ఇచ్చే జాతీయ ఉపకారవేతనాల పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు/ వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీవీబీజగదీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిది, 10వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆగస్టు 31వ తేదీలోగా 'స్కాలర్‌సిప్స్.జీటీవీ.ఐఎన్' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పంపాలని సూచించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా డిప్లమో స్థాయి దివ్యాంగ విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ ఉపకారవేతనాల కోసం, పోస్ట్ గ్రాడ్యుయేషన్ లేదా డిప్లమో కోర్సుల దివ్యాంగ విద్యార్థులు టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ ఉపకార వేతనాల కోసం ఈ నెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తేలు కుట్టి వ్యక్తి మృతి



కనకనాయుడు (ఫైల్)

గుర్ల: మండలంలోని పున్నపురెడ్డి పేటకు చెందిన పున్నపురెడ్డి కనక నాయుడు తేలు కుట్టడంతో మృతిచెందాడు. కనక నాయుడు నువ్వుల చేను కట్టలు కట్టడానికి పొలానికి బుధవారం వెళ్లాడు. కట్టలు కట్టి నువ్వుల చేను నుంచి నువ్వులు రాలుస్తుండగా కుడిచేతి బొటన వేలిపై తేలు కుట్టింది. కుటుంబసభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై భాస్కరరావు కేసు నమోదు చేశారు.

5 లీటర్ల సారా పట్టివేత

మక్కువ: మండలంలోని ఎ.వెంకంపేట గ్రామానికి చెందిన దాసరి పోలీసు 5 లీటర్ల సారాతో పోలీసులకు గురువారం పట్టుబడ్డాడు. ఈ మేరకు ఎస్సై పి.నరసింహమూర్తి మాట్లాడుతూ గ్రామంలో దాసరి పోలీసు సారా విక్రయిస్తున్నట్లు స మాచారం అందడంతో, పోలీసులు గ్రామానికి వెళ్లి సోదా నిర్వహించగా, 5లీటర్ల సారా దొరికిందని చెప్పారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి, సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.

వణుకుతున్న మన్యం

- వైరల్ జ్వరాలతో భయాందోళనలో జిల్లా ప్రజలు
- పెరుగుతున్న మలేరియా, డెంగీ కేసులు
- సొంత సొమ్ముతో మందులు కొనుగోలు చేసిన వైద్యులు, వార్డెన్లు
- తోణాం పీహెచ్‌సీలో అత్యధికంగా మలేరియా కేసుల నమోదు



సాలూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రైవేట్ ఏఎన్‌ఎం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న వైద్యసేవలు

సాలూరు: వైరల్ ఫీవర్, మలేరియా, డెంగీ, వంటి సీజనల్ వ్యాధులతో పార్వతీపురం మన్యం జిల్లా మంచం పట్టింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో వైరల్, మలేరియా, డెంగీ వంటి సీజనల్ జ్వరాలు ప్రారంభమ య్యాయి. దీంతో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. మరికొంత మంది ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

వందల్లో నమోదవుతున్న మలేరియా కేసులు

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటికే వందల్లో మలేరియా కేసులు నమోదయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం 500 కేసులు నమోదు కాగా, అనధికారికంగా మరెన్నో వందల కేసులు నమోదవుతున్నాయి. అంతేకాకుండా 20 డెంగీ కేసులు నమోదయ్యాయి. సాలూరు మండలంలని తోణాం పీహెచ్‌సీలో అత్యధికంగా 30 మలేరియా కేసులు, సాలూరు మున్సిపాలిటీలో 3 డెంగీ కేసులు నమోదయ్యాయి. పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీలు, పరిసర ప్రాంతాల్లోనే ఈ డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. అవికాకుండా ఏ జ్వరం వచ్చినా ఆస్పత్రికి రాకుండా గ్రామాల్లో సంచి వైద్యులకు పరిమితమవుతున్న పలువురు ప్రజలు ఉన్నారు.

మంచం పడుతున్న 'ఆశ్రమ' విద్యార్థులు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వైరల్, మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారు. ఈ పాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకం కాకపోవడంతో వారికి తరచూ వైద్య పరీక్షలు చేసే పరిస్థితి లేదు. ఈ క్రమంలో విద్యార్థుల ఆరోగ్యం కోసం స్థానిక పాఠశాలల వార్డెన్లు తమ సొంత డబ్బుతో చికిత్స చేయిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. సాలూరు మండలంలోని తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎం లేకపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు సొంత డబ్బు ఎత్తుకుని, కొంత జీతానికి ఓ ప్రైవేట్ ఏఎన్‌ఎంను నియమించి విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తున్నారు. పలు ఆశ్రమ పాఠశాలల్లో ఇదే పద్ధతి కొనసాగుతున్నట్లు సమాచారం. మరికొందరు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు.

నిధుల కొరతతో అందని మందులు

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం షరామామూలే. ఈ నేపథ్యంలో మలేరియా జ్వరాలు అధికంగా నమోదయ్యే అవకాశమున్న పీహెచ్‌సీలకు ముందుగానే మందులు పంపించాల్సి ఉంది. అయితే సుమారు రెండు వారాల ముందు వరకు నిధుల కొరతతో పీహెచ్‌సీలకు పూర్తి స్థాయిలో మందులు అందించలేక జిల్లా అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంలో పీహెచ్‌సీ వైద్యులే తమ సొంత డబ్బుతో ముందుగా మందులు కొనుగోలు చేసిన పరిస్థితులు ఉన్నాయి.

పదుల సంఖ్యలో బెడ్లు..వందల్లో రోగులు

కాగా ఆస్పత్రుల్లో బెడ్‌లు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాలూరు ఏరియా ఆస్పత్రిలో 200మంది రోగులు చికిత్స పొందుతుండగా ఆస్పత్రిలో సుమారు 60 బెడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో రోగులు వారికి తోడుగా వచ్చిన బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏఎన్‌ఎంల నియామకం ఎప్పుడు?

సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో చాలావరకు ఆశ్రమపాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. కాగా ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకం చేస్తామని స్త్రీ శిశుసంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మంత్రి సంధ్యారాణి తెలిపారు. నేటి వరకు ఆ దిశగా ఇంకా అడుగులు పడకపోవడం, మరోవైపు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో వెంటనే ప్రభుత్వం స్పందించాలని పలువురు ప్రజలు కోరుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేరువగా వైద్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల వద్దకే వైద్యాన్ని చేరువ చేసిన పరిస్థితులను జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలతో పాటు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమతెరల పంపిణీ, ఏసీఎం ద్రావణం పిచికారీ, తరచూ వైద్య శిబిరాలను నిర్వహించడం, వంటి కార్యక్రమాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టారని చర్చించుకుంటున్నారు. ఇకనైనా ప్రస్తుతం ప్రభుత్వం స్పందించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏరియా ఆస్పత్రికి విద్యార్థుల తాకిడి



వైద్యపరీక్షలు చేసుకోవడానికి క్యూలో ఉన్న విద్యార్థులు

సీతంపేట: జ్వరాల సీజన్ కావడంతో బాధపడుతున్న విద్యార్థులు సీతంపేట ఏరియా ఆస్పత్రికి ఎక్కువగా వస్తున్నారు. ఆశ్రమపాఠశాలలు, మినీగురుకులాలు, కేజీబీవీ, గురుకులాల హస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థులు సంబంధిత స్టాఫ్‌తో రావడంతో వారికి అన్ని రక్తపరీక్షలు చేసి వైద్యసేవలు అందజేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.

చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలో ఇప్పటివరకు 500మలేరియా, 20 డెంగీ కేసులు నమోదయ్యాయి. సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తున్నాం. వైద్యారోగ్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నిబద్ధతతో పనిచేస్తున్నారు. ఏసీఎం ద్రావణం పిచికారీ జరుగుతోంది.

–డా.జగన్మోహన్‌రావు, జిల్లా మలేరియానివారణ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

విషజ్వరంతో బాలుడి మృతి

- వైద్యసిబ్బంది నిర్లక్ష్యమే శాపం
- గిరిజన సంఘాల ఆరోపణ



విషజ్వరంతో చనిపోయిన బాలుడు పోతురాజు

శృంగవరపుకోట: గిరిశిఖర గ్రామాల్లో మరో పసి ప్రాణం ప్రభుత్వ వైద్యాధికారుల నిర్లక్ష్యానికి బలైంది. శృంగవరపు కోట మండలం మూల బొడ్డవర పంచాయతీ పరిధి జిల్లేడులోవ గ్రామానికి చెందిన చదరం భీమరాజు-సీతల 3వ సంతానం పోతరాజుకు జ్వరం వచ్చి బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో చనిపోయాడు. జ్వరంతో బాలుడు చనిపోయిన ఘటన గ్రామంలో విషాదం నింపడంతో పాటు గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తోంది.

చనిపోయాక పరామర్శ

గిరిశిఖర గ్రామంలో బాలుడు చనిపోయిన విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో గురువారం గ్రామానికి వెళ్లిన పీహెచ్‌సీ డాక్టర్ శిరీష, ఎంపీహెచ్ఓ సన్యాసినాయుడులు ఒక నివేదిక సిద్ధం చేశారు. మృతుని కుటుంబీకులు 5న సాలూరు నుంచి వచ్చి, బాలుడిని 8న ఎస్.కోటలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారని, 12న డిశ్చార్జ్ అయి గ్రామానికి వెళ్లిపోయారని, ప్రైవేట్ వైద్యుల్ని ఆశ్రయించడం వల్లనే బాలుడు చనిపోయాడని పేర్కొన్నారు.

వైద్యసిబ్బంది నిర్లక్ష్యమే కారణం

గిరిశిఖర గ్రామాలకు వైద్యసిబ్బంది వచ్చి, వైద్యం చేయక, వైద్య శిబిరాలు పెట్టక, అవగాహన కల్పించక పోవడం వల్లనే గిరిజనుల ప్రాణాలు పోతున్నాయని గిరిజన సంఘాల నేతలు జె.గౌరీష్, ఆర్.శివ, రమణ, గంగరాజు, పోతురాజు, అరుణ్‌కుమార్, భీమయ్యలు చెబుతున్నారు.5వ తేదీ నుంచి 18 తేదీ మధ్యలో ఒక్కసారైనా గ్రామానికి వైద్యసిబ్బంది వచ్చిఉంటే ఏడు కొంపలున్న గ్రామంలో పోతరాజు విషయం తెలిసి ఉండేదన్నారు. ప్రభుత్వం మృతుని కుటుంబానికి పరిహారం చెల్లించి, బొడ్డవరలో మినీ పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని, బాలుడి మృతికి కారణమైన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్‌పై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి

విజయనగరం క్రైమ్: ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కల్యాణ్ చక్రవర్తి స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని వీటీ అగ్రహారం పాత జిల్లా కోర్టు ప్రాంగణం వద్ద గురువారం హెల్మెట్ వాడకంపై ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు వాహనం నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. యువత ప్రమాదభరిత విన్యాసాలతో డ్రైవింగ్, మత్తు పదార్థాలు తీసుకుని వాహనం నడపడం, డబుల్, త్రిబుల్ రైడింగ్ వల్ల ప్రమాదాల బారిన పడి వారితో పాటు ఎదుటి వారిని ఇబ్బందులకు గురిచేయడం వల్ల అంగవైకల్యంతో పాటు ప్రాణనష్టం కలుగుతుందన్నారు. వాటిని అధిగమించాలంటే హెల్మెట్ ధారణ తప్పనిసరి అని హితవు పలికారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకల్యాణి, న్యాయమూర్తులు, జడ్జిలు, రూరల్ పోలీస్ అధికారులు, ఎన్‌సీసీ కెప్టెన్ కల్యాణ్ అశోక్, ప్రభుత్వ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలపై ఆరా

- వైద్యసిబ్బందిపై డీఎంహెచ్ఓ అసహనం
- బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



దేవుపల్లి పీహెచ్‌సీలో ప్రసవాల రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

బొండపల్లి: గడిచిన ఎనిమిది నెలలుగా దేవుపల్లి పీహెచ్‌సీలో ఒక్క ప్రసవం కూడా ఎందుకు జరగలేదంటూ డాక్టర్ శర్మిష్టతో పాటు వైద్యసిబ్బందిపై డీఎంహెచ్ఓ ఎస్.భాస్కర రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు బొండపల్లి మండలంలోని దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మధ్యాహ్నం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ప్రసవాల రికార్డులు పరిశీలించారు.గత 8 నెలలుగా ఒక్క ప్రసవం కూడా జరగని విషయాన్ని ఈ సందర్భంగా గుర్తించారు. పీహెచ్‌సీ పరిధిలో గ్రామాలు ఎక్కువగా ఉన్నప్పటికీ ఒక్క ప్రసవం కూడా జరగకపోవడాన్ని గమనించారు. ఇక నుంచి తప్పనిసరిగా పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణుల ప్రసవాలన్నీ తప్పనిసరిగా పీహెచ్‌సీలోనే జరిగే విధంగా చుడాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు. 8 నెలలుగా పీహెచ్‌సీలో ప్రసవాలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని గుర్తించామని వారిపై చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు డీఎంహెచ్ఓ చెప్పారు. లెప్రసీ సర్వే ఏవిధంగా చేస్తున్నారో ఆరా తీసేందుకు కనిమెరక గ్రామ పరిధిలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈఓ బి.నారాయణప్పలనాయుడు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పర్యటన



చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు సీతారాం

పార్వతీపురంటౌన్: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు కమిషన్ కార్యాలయం కార్యదర్శి గురువారం ఒక ప్రకటన విడుదల చేసినట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ తెలిపారు. గురువారం రాత్రి 7.30 గంటలకు వారు మంగళగిరి నుంచి రోడ్డు మార్గాన బయలు దేరి, శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పార్వతీపురం చేరుకుంటారు. 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వ శాఖల పాత్రపై సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు భోజన విరామం అనంతరం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వివిధ ప్రభుత్వ, గిరిజన సంక్షేమ వసతి గృహాలను, కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సందర్శించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి మంగళగిరి వెళ్తారని ప్రకటనలో వివరించారు.

గాయత్రి ఆక్వా నీటి వ్యాపారంపై చర్యలు తీసుకోవాలి

- గ్రామసందర్శనలో అధికారులకు గ్రామస్తుల మొర



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం గ్రామంలో భూగర్భజలాలను కాపాడాలని గ్రామ సర్పంచ్ రౌతు శ్రీరామమూర్తితో సహా గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో పాటు అధికారుల ఎదుట మొర పెట్టుకున్నారు. ఈ మేరకు గురువారం పేరాపురం సచివాలయం పరిధిలో పూసపాటిపాలెం గ్రామంలో గ్రామసందర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలను గ్రామస్తులు ప్రస్తావించారు. గాయత్రి ఆక్వా పరిశ్రమ నుంచి నిత్యం ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి వ్యాపారం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పేరాపురంలో హౌసింగ్ లేఅవుట్‌ను లబ్ధిదారులకు తెలియకుండానే రద్దు చేశారని పలువురు ప్రశ్నించారు. గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణం అసంపూర్తిగానే మిగిలి ఉందని, హౌసింగ్ బిల్లుల మంజూరులో జాప్యం జరిగిందని పలువురు తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఏ ప్రాతిపదికన కలిపారో తెలియజేయాలని కోరారు. పూసపాటిపాలెంలో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్‌శాతం పెరిగిందని సర్పంచ్ రౌతు స్వామినాయుడు జాయింట్ కలెక్టర్‌కు తెలియజేశారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి.శాంతకుమారి, తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ, ఎంపీడీఓ ఎం.రాధిక, వ్యవసాయ అధికారి నీలిమ, మండల ఇంజినీరింగ్ అధికారులు మరళీమోహన్, శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, ఏపీఓ రత్నమాల, ఏపీఎం పెంటం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో రాణించిన లక్ష్మణ్



సాధించిన పతకాలతో బండారు లక్ష్మణ్

విజయనగరం రూరల్: బెంగళూరులో ఈ నెల 17న జరిగిన జాతీయ పారా అథ్లెటిక్ క్రీడాంశాల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన జిల్లాకు చెందిన బండారు లక్ష్మణ్ 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన లక్ష్మణ్ సిల్వర్ మెడల్స్ సాధించడంపై కోచ్ క్రిష్ణారెడ్డి, తండ్రి అర్జున్ అభినందించారు.

బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ప్రారంభం

- 150 మంది క్రీడాకారులు హాజరు



బ్యాడ్మిటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లాలోని డీఎస్‌సీ ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజుల పాటు వివిధ విభాగాల్లో నిర్వహించే బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు అండర్-11, 13 విభాగంలో పోటీలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.ఎ.నాయుడు ప్రారంభించారు. తొలిరోజు పోటీల్లో 150 మంది క్రీడాకారులు తలపడ్డారు. ఈ సందర్భంగా కె.ఎ.నాయుడు మాట్లాడుతూ అనంతపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-11 నుంచి సీనియర్స్ విభాగం వరకు పోటీలకు జిల్లా స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతుల ప్రదానంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఇందుకూరి రఘురాజు, కార్యదర్శి నున్నా సురేష్ పాల్గొన్నారు.

ఏయూ ఇన్‌చార్జి వీసీగా కొత్తపల్లి వాసి

గరుగుబిల్లి: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా గరుగుబిల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆచార్య గొట్టాపు శశిభూషణ్ నియామకమయ్యారు. అప్పలనాయుడు, పార్వతమ్మల కుమారుడు శశిభూషణ్ పాఠశాల విద్యను కొత్తపల్లి, కొత్తూరు గ్రామాల్లోను, ఇంటర్మీడియట్‌ను బొబ్బిలిలో అభ్యసించారు. విశాఖలోని గీతం కళాశాలలో ఈసీఈ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. విద్యాభ్యాసం అనంతరం హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్ట్‌లో ఇంజినీరింగ్ విభాగం డైరెక్టర్‌గా పదేళ్లు పనిచేశారు. అనంతరం ఆంధ్రా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పదేళ్లుగా కొనసాగుతూ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఏడాది విధులు నిర్వర్తిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వ్యక్తి వర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్‌గా నియామకంతో జిల్లావాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కొత్తపల్లి సర్పంచ్ గొట్టాపు శ్రీవేణి, మాజీ సర్పంచ్ గొట్టాపు తేజేశ్వరరావు, గ్రామస్తులతో పాటు కొప్పులవెలమ జిల్లా సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధి కొరుపోలు సత్యారావు ఆయనకు అభినందనలు తెలిపారు.

మధ్యాహ్నమే ముగింపు

- ఒంటిగంటతో పూర్తయిన గ్రామ సందర్శన



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గజపతినగరం రూరల్: ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ గ్రామంలోనే అన్ని శాఖల అధికారులు ఉండి ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పనితీరును పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు మొక్కుబడిగా గ్రామ సందర్శన కార్యక్రమం ముగించేశారు. కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు గజపతినగరం మండలంలోని భూదేవిపేట గ్రామంలో మండల ప్రత్యేకాధికారి రమేష్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి రమేష్‌తో పాటు ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంఈఓ విమల, ఇతర అన్ని శాఖల అధికారులు ఒంటిగంట అవగానే గ్రామసందర్శన పూర్తిచేసి గ్రామం విడిచిపెట్టేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల తరగతి గదిలో విద్యార్థులతో ప్రత్యేకాధికారి మాట్లాడారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. భోజనంలోకి వంటలను పామాయిల్‌తో చేయడాన్ని గమనించిన ఆయన నిర్వాహకులపై మండిపడ్డారు. రిఫైన్డ్ ఆయిల్ వినియోగించకుండా పామాయిల్ వాడితే విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినదా? అంటూ నిర్వాహకులను మందలించారు. కేవలం పాఠశాల, ఎండీఎం తీరును చూసి ఆయన గ్రామ సందర్శన ముగించారు. సాయంత్రం ఐదు గంటల వరకూ గ్రామంలో ఉండాల్సిన అధికారులు ప్రత్యేకాధికారితో పాటు ఒంటిగంటతోనే గ్రామ సందర్శన ముగించి వెనుదిరిగారు.

అధికారులంతా వరండాలోనే

గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా భూదేవిపేట వచ్చిన వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, వెలుగు, ఉపాధి, విద్యుత్, హౌసింగ్, నీటిపారుదల, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అధికారులంతా కుర్చీలు లేక, వారిని కూర్చోమనే నాథుడు కనబక వరండాల్లోనే నిలబడిపోయారు. కనీసం ప్రత్యేక అధికారి కూడా చూసీ చూడనట్లు వ్యవహరించడంతో వారంతా వరండాలకే పరిమితమై వచ్చినప్పటి నుంచి వెళ్లేంత వరకూ అలాగే నిలబడిపోయారు. వర్షం పడడంతో నిలబడడానికి కూడా అవకాశం లేక కొంతమంది అటు, ఇటు తిరుగుతూ వర్షంలో తడిసిపోయారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, బెల్లాన త్రినాథతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పామాయిల్ వినియోగంపై ఎండీఎం నిర్వాహకురాలితో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రమేష్